క్లుప్తంగా

ఓటుహక్కును వినియోగించుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలింగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం తాడ్వాయి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఆటలు, పాటల ద్వారా ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. మే నెల 13న ఎంపీ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నా రు. కళాకారులు రమేష్‌రావు, విఠల్‌రెడ్డి, మహేందర్, రాం, దేవయ్య, నాగరాజు, కాశీరాం, ప్రశాంత్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.తాడ్వాయి మాజీ సర్పంచ్ బండారిసంజీవులు, వీడీసీ చైర్మన్ మేకల రాజు, నాయకుడు భరత్‌రావు, ఎండ్రియాల్ మాజీ ఉపసర్పంచ్ సుధాకర్‌రావు, దేవాయిపల్లికి చెందిన నాయకుడు శశికాంత్‌రెడ్డి తదితరులు చేరిన వారిలో ఉన్నారు. పార్టీలో బాగా పనిచేసిన వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు షౌకత్‌అలీ, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని కొమలంచ గ్రామ ఈజీఎస్ వన నర్సరీని సోమవారం ఎంపీడీవో గంగాధర్ పరిశీలించారు. వన నర్సరీల్లో ఏర్పాటు చేయడంతో పాటు వాటి సంరక్షణపై దృష్టి సారించాలని గ్రామ జీపీ సిబ్బందికి సూచించారు. చెట్ల మధ్య ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి నీటిని అందించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులు ఉన్నారు.

పోరాటాల ఫలితంగానే వేతనాలు విడుదల



బాన్సువాడ : కార్మికులు చేసిన పోరాట ఫలితమే నేడు వేతనాల చెల్లింపులు జరిగాయని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు అన్నారు. సోమవారం ఏరియా ఆస్పత్రిలో ఆయన మాట్లాడారు. ఏరియా ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పనిచేస్తున్న పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు తమకు కాంట్రాక్టర్ ద్వారా రావాల్సిన నాలుగు నెలల వేతనాల కోసం కొన్ని రోజులుగా నిరసనలు వ్యక్తం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంతోష్‌గౌడ్, రేణుక, కమురోద్దీన్, సంగీత, సుశీల తదితరులున్నారు.

లింగంపేట ఎంపీడీవోగా నరేశ్



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆర్ నరేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. లింగంపేట ఎంపీడీవోగా పనిచేసిన మల్లికార్జున్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో జుక్కల్ నుంచి నరేశ్ లింగంపేటకు బదిలీపై వచ్చారు.

బహుజనులను చైతన్యం చేస్తాం



మాచారెడ్డి : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బహుజనులను చైతన్యపర్చి 17 స్థానాల్లో మెజారిటీ సాధిస్తామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు బట్టింకి బాల్‌రాజు అన్నారు. సోమవారం పాల్వంచ మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ తమ్మడి స్వామి, కామారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులు సాయిలు తదితరులున్నారు.

కల్యాణం... కమనీయం

- కనుల పండువగా సిద్దరామేశ్వరస్వామి కల్యాణోత్సవం
- తరలివచ్చిన భక్తజనం



భిక్కనూరులోని సిద్దరామేశ్వరాలయంలో కల్యాణోత్సవం



కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

భిక్కనూరు : పచ్చని పందిళ్లలో మేళతాళాల వాయిద్యాలు, వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణాల మధ్య దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్దరామేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా సోమవారం నిర్వహించారు. భిక్కనూరు మండల భక్తులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి స్వామి వారి భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని మాత భువనేశ్వరి దేవితో వైభవంగా నిర్వహించారు. వేకువ జామునుంచే భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని సిద్ధరామేశ్వరుని కల్యాణంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. కల్యాణం అనంతరం మహిళలు పెద్ద ఎత్తున స్వామి వారికి అమ్మవారైన మాత భువనేశ్వరి దేవికి ఒడి బియ్యంను కట్నకానుకలను సమర్పించుకున్నారు. వేద బ్రాహ్మణులు సిద్ధగిరి శర్మ, రామగిరిశర్మ, రాజేశ్వరశర్మ పూజారి సిద్దేశ్వర్‌లు, సదాశివమహంత్ స్వామి వారి కల్యాణంను శాస్త్రోక్తంగా జరిపించారు. తదుపరి భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

పార్టీని నమ్ముకున్నవారికే భవిష్యత్తు



కాసుల బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

బాన్సువాడ : పార్టీని నమ్ముకున్న ప్రతీ కార్యకర్తకు భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. సోమవారం నియోజకవర్గానికి చెందిన పలువురు మున్నూరు కాపు కులస్తులు ఆయన్ని కలిసి సన్మానించారు. మున్నూరుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా మున్నూరు కాపులకు న్యాయం చేశారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపిగా సురేష్ షేట్కారును గెలిపించేందుకు కృషి చేయాలని అన్నారు. మున్నూరు కాపు కులస్తులు కొట్టం గంగాధర్, బిట్ల సురేందర్, పత్తి గంగారం, దాసరి శ్రీనివాస్, అబ్బయ్య తదితరులున్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా కమిటీ ఎన్నిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం బీజేపీ ఎస్సీ మోర్చా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా సంఘనొల్ల బాల్‌రాజు, ఉపాధ్యక్షులుగా రాకేశ్, నవీన్, సుద్దపల్లి సాయిలు, కిషన్, ప్రధానకార్యదర్శిగా కొత్తపల్లి నవీన్, కార్యదర్శులుగా ఆస లక్ష్మణ్, ఎడ్ల రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కుంట రాంరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి మార రమేశ్‌రెడ్డి, భూంరావు, చక్రధర్ గౌడ్, స్వరణ్‌రెడ్డి, మోహన్ రాజ్, కటికే రమేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని పద్మాజివాడి గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంట శ్రీనివాస్ రెడ్డి, క్యాషియర్‌గా ఏనుగు మల్లారెడ్డి, కార్యదర్శిగా మామిడి రాకేశ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా యాల్ల శ్రీనివాస్ రెడ్డి, ఎర్రవటి గోపాల్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

ఆధ్యాత్మికం

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ మూడవ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 12:35 నిమిషాలకు మాతా రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రవిగౌడ్, మనోహర్‌గౌడ్, రాజాగౌడ్, నారాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన



మాచారెడ్డి : మండలంలోని అక్కాపూర్‌లో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం వేదగురు వందనం, నిత్యపూజ హోమాదులను కన్నుల పండువగా నిర్వహించారు. దేవతా విగ్రహాల ప్రాణప్రతిష్ఠ అనంతరం జీవ కళాన్యాసం, మహాబలి నివేదన హారతి కార్యక్రమాల తర్వాత తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పొన్నాల లక్ష్మారెడ్డి, గడ్డం బాబు, పొన్నాల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివలింగ ప్రతిష్ఠాపన



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లి సాయిబాబా ఆలయంలో సోమవారం పంచముఖ శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమం ముగిసింది. ఆలయ ధర్మకర్త పట్ల మోహన్‌రెడ్డి వైదిక వేద మార జ్యోతిష్య చండీ ఉపాసకులు గురురాజశర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగిన ప్రత్యేక పూజలు లింగ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటరమణరెడ్డి, నందరెడ్డి, పోతారెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అవిశ్వాసం వీగిపోవడంపై హర్షం



మాట్లాడుతున్న ఎంపీపీ దశరథ్‌రెడ్డి

రామారెడ్డి : రామారెడ్డి మండల పరిషత్ తొలి ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డిపై ఏడుగురు ఎంపీటీసీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సోమవారం వీగిపోవడంతో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తూ పటాకులు కాల్చారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దశరథ్ రెడ్డి మాట్లాడుతూ పదిమంది ఎంపీటీసీ సభ్యులలో ఒక్కరిద్దరు ఎంపీటీసీ సభ్యుల అసత్య ప్రచారాలు నిర్వహిస్తూ మిగిలిన 8 మంది ఎంపీటీసీ సభ్యులను తప్పుదోవ పట్టించి తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారని, సభ మొత్తం ఓటింగ్‌కు దూరం ఉండి తనకు మద్దతు తెలపడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు రాంరెడ్డి, పడిగెల శ్రీనివాస్, ల్యాగాల మైపాల్ తదితరులున్నారు.

వైభవంగా మార్వాడీల శీతల్ ఉత్సవ్



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని మార్వాడీ మహిళలు రాజస్తాన్ సంప్రదాయం ప్రకారం శీతల్ ఉత్సవ్‌ను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మార్వాడీ మహిళలు స్థానిక పోచమ్మ గుడిలో పిల్లపాపలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోలీ అనంతరం వారం రోజుల తర్వాత ప్రతి ఏడాది శీతల్ ఉత్సవ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్వాడీ మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల సరళిపై అవగాహన



బాన్సువాడ : పార్లమెంట్ ఎన్నికల సరళిపై అధికారులకు సోమవారం అవగాహన కల్పించారు. బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలలో పీవో, ఏపీవోలకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. 85 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, కోవిడ్ పేషంట్లు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని ఆర్డీవో వివరించారు. ఏప్రిల్-23లోగా ఫారం -12 డి సమర్పించాలని, రిటరి్నంగ్ అధికారి ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించి ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అర్హులను ఏప్రిల్ 25 నాటికి ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



భిక్కనూరు : దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీ సిద్దరామేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులకు సేవలు అందించిన చైతన్య విద్యానికేతన్ విద్యార్థులను ఈవో శ్రీధర్ సోమవారం అభినందించారు. విద్యార్థులు వలంటీర్లుగా భక్తులకు మెరుగైన సేవలు అందించారని కొనియాడారు.

భారీమెజార్టీ లక్ష్యంగా కృషిచేయాలి





తాడ్వాయిలోని కాళోజీవాడిలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం, అడ్లూర్ ఎల్లారెడ్డిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : రాబోయే ఎంపీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరు కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని కాళోజీవాడిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగం రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జగ్గనర్సయ్య, యూత్ అధ్యక్షుడిగా మర్రిరాజేశ్, ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా ఇటుకల నవీన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీలను కూడా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వర్కింగ్‌కమిటీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అకిల్‌రావు తదితరులున్నారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కాలమొల్ల అశోక్, ఉపాధ్యక్షులుగా మోసర్ల రాములు, సీతగారి రాజయ్య, తండా రాజు, ప్రధానకార్యదర్శిగా ఆకుల కృష్ణ, కార్యదర్శులుగా బొలిపెల్లి రాంరెడ్డి, ఎడ్ల బాల్‌రాజ్, కోశాధికారిగా ఆస శంకర్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంగారెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కామారెడ్డి అర్బన్ : వృద్ధాప్యంలో ఆరోగ్యం, ఆనందం రెండు ఉంటేనే జీవితం భారం కాదని, ఇందుకు యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక చింతన ఎంతో ఉపయోగపడుతుందని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి అన్నారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా భవనం యోగా సెంటర్ ఐదవ వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి రాజేశ్వర్, ఎం రాజన్నలతో యోగాచార్యులు జి.అంజయ్యగుప్తా, కాసర్ల రామచంద్రం మాట్లాడారు. పలువురు సీనియర్ సిటిజన్లు యోగాసనాలు ప్రదర్శించారు. ఫోరం ప్రతినిధులు వెంకటస్వామి, పెట్టుగాడి అంజయ్య, బి గంగారెడ్డి, ప్రేంసాగర్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



కామారెడ్డి టౌన్ : జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని జహీరాబాద్ పట్టణంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జిల్లా నేతలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ కుమార్ షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గారు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా డబ్బు తరలకుండా చూడాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఎన్నికల సందర్భంగా అక్రమంంగా డబ్బు, మద్యం తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి, ఎంపీడీవో లీలవతి అన్నారు. మండలంలోని ప్రధాన రహదారిపై సోమవారం ఆమె వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలను నిలిపి తనిఖీ చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగడమే కాకుండా శరీరం ధారుఢ్యంగా ఉండి, ఆరోగ్యంగా ఉంటారని సదాశివనగర్ సీఐ సంతోష్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలో సోమవారం సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు జూనియర్ క్రీడాకారులకు వాలీబాల్ క్రీడా సామగ్రిని విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ క్రీడాసామగ్రిని సీఐ సంతోష్ క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, సీనియర్ క్రీడాకారులు, జూనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నవోదయలో విద్యార్థుల ప్రతిభ



లక్ష్మీసాయి



ప్రవళిక



లోకేశ్



గంగోత్రి



విద్యార్థిని కల్యాణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని విశ్వభారతి హైస్కూల్ నలుగురు విద్యార్థులు లక్ష్మీసాయి, లోకేశ్, ప్రవళిక, గంగోత్రి నవోదయ పాఠశాల ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సాయి లు తెలిపారు. అర్హత పరీక్ష కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా చదివించడం జరిగిందన్నారు. నవోదయ పోటీ పరీక్షలో విద్యార్థులు ఎంపికవ్వడంపై ప్రిన్సిపాల్, విద్యార్థులతల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

పట్టణంలో..

కామారెడ్డి టౌన్ : పట్టణంలోని యంగ్ మాస్టర్ మైండ్స్ పాఠశాల 5వ తరగతి విద్యార్థిని నీలం కృతిక నవోదయ పాఠశాలకు ఓపెన్ కేటగిరిలో ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తోట రంజిత్‌కుమార్ తెలిపారు. శనివారం విద్యార్థినికి పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, సతీష్, రవళి, సునంద, షబానా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నూతన కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడ : బాన్సువాడ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు పెర్క సుదర్శన్ ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కమిటీని నియమించారు. అధ్యక్షులుగా దొన్కంటి అంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా చింతల గంగాధర్, ఉపాధ్యక్షులుగా బుజ్జిగారి సాయిలు, విజయ్, ప్రధాన కార్యదర్శిగా నక్క సుదీర్‌కుమార్, కోశాధికారిగా వినోద్‌కుమార్ను ఎన్నుకున్నారు.

మొబైల్ అప్పగింత

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో లభించిన మొబైల్ ఫోన్‌ను నిజాయితీగా ఎస్సై ఆంజనేయులుకు అప్పగించిన అంజాగౌడ్‌ను సోమవారం ఎస్సై సన్మానించారు. ఎస్సై తెలిపిన వివరాలు మండలంలో గౌరారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. సదరు మొబైల్ అంజాగౌడ్‌కు లభించింది. లభించిన మొబైల్‌ను ఎస్సై కు అప్పగించడంతో మొబైల్‌ను పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించినట్లు ఎస్సై ఈ సందర్భంగా తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రాజంపేట : మండలం ఆర్గొండ సొసైటీ పరిధిలో సోమవారం ఎల్లారెడ్డిపల్లి, గుండారం, సిద్దాపూర్ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను సీఈవో సాయిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ శ్రీనివాస్, ఏఈవో మౌనిక పాల్గొన్నారు.

దోమకొండలో..



దోమకొండ : మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్ సోమవారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేయాలని ఆయన వ్యవసాయశాఖ అధికారులను కోరారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మి, ఏవో పవన్‌కుమార్, సింగిల్ విండో సీఈవో బాల్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సస్పెన్షన్

రాజంపేట : బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు కార్యకర్తలను పార్టీ నుండి సస్పెండ్ చేసినట్లు మండల అధ్యక్షులు భిక్కాజి బల్వంతరావ్ సోమవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన దగ్గారి నరేష్, జింక భాస్కర్ పార్టీ కార్యక్రమాలకు, నియమావళికి విరుద్ధంగా పనిచేసినందుకు వారిని సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి : మాచారెడ్డి ఎంపీటీసీ రాగుల వినోద భర్త ప్రభాకర్‌ను బీఆర్ఎస్ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బాల్‌చంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్‌లో కొనసాగుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని నియోజక వర్గ ఇంచార్జి గంప గోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఆదేశాల మేరకు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు వివరించారు.